మెదక్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

# అప్పులపై తప్పుడు లెక్క

మొదటిపేజీ తరువాయి...

ప్రయోజనం ఏమిటని నిలదీశారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, మూలధన పెట్టుబడి, సంక్షేమాల కోసం చేసిన అప్పు రూ.4,26,499 కోట్లు మాత్రమేనని అసెంబ్లీ వేదికగా వివరించామని చెప్పారు. తెచ్చిన అప్పులను మూలధనంగా మార్చి ఎన్ని ఆస్తులు, ఎంత సంపద సృష్టించామో లెక్కలతో సహా అసెంబ్లీ వేదికగా వివరించామని గుర్తుచేశారు. అయినా రూ.6.85 లక్షల కోట్ల అప్పు ఉన్నదని, రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొనడం ఏమిటని మండిపడ్డారు. దివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీసిందని ప్రచారం చేయడం ముఖ్యమంత్రికి తగునా? ఇది పాపం కాదా? అని ప్రశ్నించారు. కేవలం అప్పుల గురించి మాట్లాడుతున్నారు కానీ, తెలంగాణ దేశంలోనే తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో నిలిచిన విషయాన్ని ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. రాష్ట్రం దివాలా తీసిందనే మాటాలు విని పెట్టుబడులు పెట్టడానికి ఎవరైనా వస్తారా? రాజకీయ కక్షల కోసం రాష్ట్ర భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తారా? భావి తరాలకు శిక్ష వేస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రతిష్ఠను కాపాడటం అంటే విదేశాలకు వెళ్లి ఇక్కడి డొల్ల కంపెనీల్లో బోగస్ పెట్టుబడులు పెట్టినంత సులువు కాదని చురకలేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సీఎం బాధ్యత లేని వ్యాఖ్యల వల్ల ఇప్పటికే పలు పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లాయని విమర్శించారు. ప్రభుత్వ ఆనాలోచిత చర్యల వల్ల రియల్‌ఎస్టేట్ కుదేలైందని దుయ్యబట్టారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ రేవంత్ పాలనలో టాప్ పదిస్థానాల్లో సైతం లేకుండా పోయిందని మండిపడ్డారు. దీనికి మీ దివాలాకోరు వ్యాఖ్యలు, చేతగానితనం కారణం కాదా? అని ప్రశ్నించారు. రాజకీయ కక్ష సాధింపు కోసం రాష్ట్ర ప్రయోజనాలను సైతం పణంగా పెట్టే గొప్ప ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారని వ్యాఖ్యానించారు. ఇకనైనా రాష్ట్ర ప్రతిష్ఠను, గౌరవాన్ని మరింత పెంచే విధంగా వ్యవహరిస్తే మీకే కాదు రాష్ట్ర భవిష్యత్తుకు సైతం మంచిగా ఉంటుందని హితవు చెప్పారు.

### తెలంగాణ అప్పులు – వాస్తవాలు

రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్న లెక్కలు వాస్తవాలకు భిన్నంగా ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 23న విడుదల చేసిన శ్వేతపత్రంలో నాలుగు రకాల అప్పులు చూపించారని, ఇందులో రెండు రకాల అప్పులను ప్రభుత్వం చెల్లించాల్సిన అవసరం లేదని క్లియర్‌గా పేర్కొన్నారని గుర్తుచేశారు.

- ప్రభుత్వ శ్వేతపత్రంలోనే గవర్నమెంట్ హామీ లేనివి, గవర్నమెంట్ కట్టాల్సిన అవసరం లేనివి రూ.59,414 కోట్లుగా, గవర్నమెంట్ హామీ ఉండి, గవర్నమెంట్ కట్టాల్సిన అవసరం లేనివి రూ.95,462 కోట్లుగా పేర్కొన్నారు. అంటే మొత్తంగా గవర్నమెంట్ కట్టాల్సిన అవసరం లేని అప్పులు రూ.1,54,876 కోట్లు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన రూ.6,71,757 కోట్ల అప్పుల నుంచి రూ.1,54,876 కోట్లను తీసేస్తే మిగిలిన అప్పు రూ.5,16,881 కోట్లు అని హరీశ్‌రావు వివరించారు.
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన శ్వేతపత్రం ప్రకారం రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.72,658 కోట్ల అప్పు తెలంగాణకు గత ప్రభుత్వాల నుంచి సంక్రమించింది. ప్రభుత్వం కట్టాల్సిన రూ.5,16,881 కోట్ల అప్పు నుంచి దీనిని తీసేస్తే రూ.4,44,223 కోట్ల అప్పు ఉంటుంది.
- తెలంగాణ ఏర్పడక ముందు ఎస్పీవీ (స్పెషల్ పర్పస్ వెహికల్స్) ద్వారా గత ప్రభుత్వాలు చేసిన అప్పు రూ.11,609 కోట్లు. ఈ మొత్తాన్ని రూ.4,44,223 కోట్ల నుంచి తీసేస్తే రూ.4,32,614 కోట్లు మిగులుతుంది.
- ప్రభుత్వ శ్వేతపత్రంలో ఎఫ్ఆర్‌బీఎం అప్పులు మార్చి 31, 2024 వరకు ఉన్న బడ్జెట్ ప్రతిపాదనలను తీసుకున్నారు. శ్వేతపత్రం డిసెంబర్‌లోనే విడుదల చేశారు. ఈ శ్వేతపత్రంలో తెలివిగా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న రూ.6,115 కోట్ల అప్పును బీఆర్ఎస్ ఖాతాలో జమ చేశారు. కాంగ్రెస్ తీసుకున్న రూ.6,115 కోట్లను రూ.4,32,614 నుంచి తీసివేస్తే రూ.4,26,499 కోట్ల అప్పు మిగులుతుంది. అంటే తొమ్మిదిన్నర రేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4,26, 499 కోట్ల మాత్రమేనని, కానీ పదేపదే రూ.6,71,757 కోట్లు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ఈ రూ.4.26 లక్షల కోట్లలో ఉదయ్ స్కీం కింద రూ.9 వేల కోట్లు, 2019-20లో 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లను కేంద్ర ప్రభుత్వం చెల్లించకపోవడంతో అప్పు రూపంగా రూ.2,459 కోట్లు తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు. కొవిడ్ సమయంలో గ్రాంట్ల రూపంలో రాష్ట్రాలను ఆదుకోకుండా అప్పులు తీసుకునే స్థితికి కేంద్రం నెట్టిందని, అందువల్ల రూ.17,558 కోట్ల అప్పు చేయాల్సిన అని వార్యత ఏర్పడిందని వివరించారు.
- కొవిడ్ కారణంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో జీఎస్డీపీలో 1%అధికంగా అప్పు చేయాల్సి వచ్చిందని, ఆ మొత్తం రూ.10,784 కోట్లు అని వివరించారు. ఇలా రాష్ట్రం అనివార్యంగా రూ.41,159 కోట్ల అప్పు తీసుకోవాల్సిన పరిస్థితికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు, కొవిడ్ కారణమయ్యాయని, ఇది ఏ ప్రభుత్వం ఉన్నా అనివార్యంగా చేయాల్సిన అప్పు అని తేల్చి చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

# ప్రజాపాలనంతా అప్పుల కుప్ప

- కాంగ్రెస్ ప్రభుత్వ అప్పు రూ.71,495 కోట్లు
- రుణ లక్ష్యం దాటేసి ముందుకు పరుగులు
- 285 రోజుల్లో ఆర్బీఐ నుంచి రూ.46,618 కోట్లు
- కార్పొరేషన్లకు రూ.24,877 కోట్ల గ్యారెంటీలు
- ప్రతి తెలంగాణ బిడ్డపై రూ.17,873 అప్పు భారం

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అప్పు ఎంతో తెలుసా? ఇప్పటికి రూ.71,495 కోట్లు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందంటూ విషప్రచారం చేసిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత రికార్డు స్థాయిలో అడ్డగోలుగా అప్పులు చేస్తున్నది. నిరుడు డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మంగళవారం వరకు 285 రోజుల్లో రూ.71,495 కోట్లు అప్పు చేసింది. అంటే ప్రతి రోజూ రాష్ట్ర ప్రజలపై రూ.250 కోట్ల అప్పుల భారం మోపింది. ఆగస్టు 13వ తేదీ వరకే ఒక్క ఆర్బీఐ నుంచి 42,118 కోట్ల రుణం సేకరించింది. ఈ నెల 3న రూ.2,500 కోట్లు, 10న 1,500 కోట్లు.. ఇలా వారం రోజుల్లోనే రూ.4,000 కోట్లు రుణం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మంగళవారం మరోసారి రూ.500 కోట్లు అప్పు తీసుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం, ఆర్బీఐ అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారమే.. గత తొమ్మిది నెలల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆర్బీఐ నుంచి రూ.46,618 కోట్ల మేర రుణాలు సేకరించింది. వివిధ కార్పొరేషన్లకు రూ.24,877 కోట్ల గ్యారంటీలు ఇచ్చింది. మొత్తంగా.. రాష్ట్రంలోని నాలుగు కోట్ల జనాభాలో ప్రతి ఒక్కరిపై గత తొమ్మిది నెలల్లోనే రూ.17,873 భారం పడింది.

### నాలుగున్నర నెలల్లోనే.. సగం అప్పు

బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఏడాది రూ.52,576 కోట్ల రుణం సమీకరించనున్నట్టు 2023-24 బడ్జెట్‌లో ప్రతిపాదించింది. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచుతున్నారంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఈ ఏడాది అప్పుల లక్ష్యాన్ని రూ.62,012 కోట్లకు పెంచింది. అంటే నిరుటి కన్నా దాదాపు రూ.10 వేల కోట్లు ఎక్కువ. ఇందులో బహిరంగ మార్కెట్ నుంచి రూ.57,112 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1000 కోట్లు సమీకరించనున్నట్టు పేర్కొన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి లెక్కించినా.. ఆగస్టు 13వ తేదీనాటికి బహిరంగ మార్కెట్ నుంచి రూ.27వేల కోట్లు రుణాలు సమీకరించింది. అంటే ఏడాది లక్ష్యంలో దాదాపు సగాన్ని కేవలం నాలుగున్నర నెల్లలోనే చేరుకుంది. గ్యారెంటీలు కూడా కలుపుకొంటే ఈ ఏడాది లక్ష్యాన్ని దాటిపోయిందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ఈ లెక్కన ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి అప్పులు ఏ స్థాయిలో పెరుగుతాయో చెప్పడం కష్టమని చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.71,495 కోట్లు అప్పు తెచ్చి ఏం చేసిందని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వాలు తెచ్చిన అప్పులను ఒక ప్రజోపయోగ ప్రాజెక్టు కోసమో, విప్లవాత్మక పథకం కోసమో ఖర్చు చేస్తాయని చెప్తున్నారు. మరి కాంగ్రెస్ ప్రభుత్వం గత తొమ్మిది నెలల్లో తెచ్చిన నిధులతో ఏ ప్రాజెక్టు చేపట్టిందో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

### బాండ్ల వేలం ద్వారా పొందిన నిధులు.. (ఆర్బీఐ నివేదిక ఆధారంగా..)

| తేదీ | సేకరించిన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|
| డిసెంబర్ 12 | 500 |
| డిసెంబర్ 19 | 900 |
| జనవరి 16 | 2,000 |
| జనవరి 23 | 1,000 |
| ఫిబ్రవరి 6 | 2,000 |
| ఫిబ్రవరి 13 | 1,000 |
| మార్చి 5 | 2,000 |
| మార్చి 12 | 2,000 |
| మార్చి 19 | 2,000 |
| మార్చి 26 | 1,718 |
| ఏప్రిల్ 2 | 1,000 |
| ఏప్రిల్ 8 | 1,500 |
| ఏప్రిల్ 23 | 1,500 |
| మే 7 | 3,000 |
| మే 14 | 1,000 |
| జూన్ 4 | 2,000 |
| జూన్ 18 | 2,000 |
| జూన్ 25 | 1,000 |
| జూలై 2 | 2,000 |
| జూలై 16 | 2,000 |
| జూలై 23 | 3,000 |
| జూలై 30 | 1,000 |
| ఆగస్టు 6 | 3,000 |
| ఆగస్టు 13 | 3,000 |
| సెప్టెంబర్ 3 | 2,500 |
| సెప్టెంబర్ 10 | 1,500 |
| సెప్టెంబర్ 17 | 500 |
| మొత్తం | 46,618 |

### కార్పొరేషన్లకు అడ్డగోలుగా గ్యారంటీలు

వివిధ కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలకు ప్రభుత్వం అడ్డగోలుగా గ్యారంటీలు ఇస్తున్నది. అధికారంలోకి వచ్చిన కేవలం ఎనిమిదిన్నర నెలల్లోనే రూ.25 వేల కోట్ల మేర గ్యారంటీలు ఇచ్చింది. ఈ అప్పులను కార్పొరేషన్లు రెండు విధాలుగా చెల్లించాల్సి ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. మొదటిది.. పన్నులు, చార్జీల రూపంలో ప్రజల నుంచి వసూలు చేయడం, రెండోది.. ప్రభుత్వమే ఈ మొత్తాన్ని చెల్లించడం. ఎలా చూసినా ప్రజలకే నష్టమని స్పష్టం చేస్తున్నారు.

### ప్రభుత్వ గ్యారెంటీతో కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలు తీసుకున్న రుణాలు

| కార్పొరేషన్ | గ్యారెంటీ ఇచ్చిన సంస్థ | తీసుకున్న రుణం (రూ.కోట్లలో) | తేదీ | కారణం |
|---|---|---|---|---|
| ఎస్పీడీసీఎల్ | ఆర్ఈసీ | 1000 | 23.1.2024 | విద్యుత్ కొనుగోలు, ఇతర అప్పులు |
| ఎన్పీడీసీఎల్ | ఎస్‌బీఐ | 1000 | 04.03.2024 | విద్యుత్ కొనుగోలు, ఇతర అప్పులు |
| టీజీసీఎస్‌సీఎల్ | పీఎన్‌బీ | 1000 | 22.03.2024 | ధాన్యం కొనుగోలు |
| టీజీటీఎస్‌సీఎల్ | నాబార్డ్ | 3000 | 01.06.2024 | ధాన్యం కొనుగోలు |
| హౌసింగ్ బోర్డ్ | హడ్కో | 3000 | 12.03.2024 | ఇందిరమ్మ ఇండ్లు |
| టీయూఎఫ్ఐడీసీ | ఐఓబీ | 1000 | 07.05.20 | మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు |
| మార్క్‌ఫెడ్ | ఎన్సీడీసీ | 12000 | 18.04.2024 | ధాన్యం కొనుగోలు |
| మార్క్‌ఫెడ్ | బీవోఐ,పీఎన్‌బీ | 327.92 | 08.05.2024 | మక్కల కొనుగోలు |
| మార్క్‌ఫెడ్ | పీఎన్‌బీ | 65.34 | 08.05.2024 | పొద్దు తిరుగుడు పంట కొనుగోలు |
| మార్క్‌ఫెడ్ | పీఎన్‌బీ | 400.74 | 05.06.2024 | మక్కల కొనుగోలు |
| మార్క్‌ఫెడ్ | ఎన్సీడీసీ | 1733.71 | 02.07.2024 | మక్కల కొనుగోలు |
| మార్క్‌ఫెడ్ | ఐఓబీ | 350 | 03.07.2024 | ఎరువుల కొనుగోలు |
| మొత్తం | | 24,877.71 | | |

### ఆర్బీఐ నుంచి రోజూ 163 కోట్ల అప్పు

రిజర్వు బ్యాంకు నుంచి తొమ్మిది నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.46,618 కోట్లు తీసుకున్నది. అంటే ప్రతిరోజూ సగటున రూ.163 కోట్ల మేర కేంద్ర బ్యాంకు నుంచి అప్పు తెచ్చుకుంటున్నది. గత ఏడాది డిసెంబర్ 12న రూ.500 కోట్లతో అప్పుల వేట మొదలు పెట్టి.. సగటున నెలకు రూ.5 వేల కోట్ల చొప్పున ఆర్బీఐ నుంచి రుణాలు సేకరించింది. ఇంకా సేకరిస్తూనే ఉన్నది.

## రాజస్థాన్‌లో సింగరేణి సోలార్ ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): వ్యాపార విస్తరణ దిశలో భాగంగా రానున్న రోజుల్లో రాజస్థాన్‌లో సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం పేర్కొన్నారు. సింగరేణి భవన్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో భాగంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రానున్న ఐదేండ్లల్లో రూ.60వేల కోట్ల టర్నోవర్‌ను సాధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. సింగరేణిలో మూసివేసిన ఉపరితల గనుల్లో పంప్డ్ స్టోరేజీ ప్లాంట్, ఎన్టీపీసీలో మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు, ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ సమీపంలో 1600 మెగావాట్ల థర్మల్ ప్లాంట్, మరో 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్‌ప్లాంట్, బ్యాటరీ స్టోరేజీ సిస్టమ్ వంటి వినూత్న ప్రాజెక్ట్‌లతో సింగరేణి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు ఎస్‌డీఎం సుబానీ, డీ రవిప్రసాద్ పాల్గొన్నారు.

## సింగరేణిలో ఉద్యోగ ఫలితాలు విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 17(నమస్తే తెలంగాణ): సింగరేణి కాలరీస్‌లో 272 ఎక్స్‌టర్నల్ ఉద్యోగాలకు జూలై 20, 21వ తేదీల్లో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాను scclmines.comలో అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు.

# రైతులకు రేవంత్ బాకీ 25వేల కోట్లు!

- అన్నదాతలకు భారీ స్థాయిలో బకాయిపడ్డ సర్కారు
- ఇచ్చిన హామీల మేరకు రైతు భరోసా 11,475 కోట్లు
- 2 లక్షల రైతు రుణమాఫీకి రూ. 13వేల కోట్లు
- పంటనష్టపరిహారం రూ. 500 కోట్లు
- పంటకోతకొస్తున్నా అందని పెట్టుబడిసాయం

హైదరాబాద్, సెప్టెంబర్ 8(నమస్తే తెలంగాణ): 'ఒక్క సంవత్సరం మేం కడుపుకట్టుకుని పని చేస్తే.. రైతులకు చెల్లించాల్సిన 40 వేల కోట్ల రుణాలను ఎడుమ చేత్తో చెల్లిస్తాను..' ఇదీ ఓ సందర్భంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే 9 నెలలు కావస్తున్నది. కానీ రైతులను బాకీలను మాత్రం తీర్చలేదు. ఇప్పటివరకు వివిధ హామీల ద్వారా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు వంద కాదు రెండువందలు కాదు ఏకంగా రూ.25వేల కోట్లకు పైగా బాకీ పడింది. ఇందులో వానకాలం రైతు భరోసా పెట్టుబడి సాయం కింద రూ.11,475 కోట్లు, రైతు రుణమాఫీ కింద రూ.13 వేల కోట్లు, పంట నష్టపరిహారం కింద రూ.428 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉన్నది. ఈ బాకీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పుడు చెల్లిస్తారో నని రైతులు ఎదురుచూస్తున్నారు.

### సీజన్ పూర్తయినా దక్కని భరోసా

ఓవైపు వానకాలం పంటల సాగు పూర్తయి. పంటలు కోతకు వచ్చే సమయం వచ్చినా ప్రభుత్వం రైతులకు పెట్టుబడిసాయం అందించలేదు. కేసీఆర్ ప్రభుత్వం పంట సాగు సమయానికి పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో టంచనుగా జమ చేసేది. గత వానకాలం పెట్టుబడి సాయాన్ని జూన్ 26న మొదలుపెట్టి ఆగస్టు 23నాటికి పూర్తి చేసింది. 70లక్షల మంది రైతులకు చెందిన 1.53కోట్ల ఎకరాలకు రూ.7624 కోట్లు పంపిణీ చేసింది. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీజన్‌కు ఎకరానికి రూ.7500 చొప్పున పెట్టుబడిసాయం అందిస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి రెండు సీజన్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు పెంచిన పెట్టుబడి సాయాన్ని రైతులకు ఇవ్వలేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ. 7500 చొప్పున 1.53కోట్ల ఎకరాలకు రూ.11,475 కోట్లు పెట్టుబడి సాయంగా పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు సయాపైసా ఇవ్వకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### పంటనష్ట పరిహారమేదీ ?

రైతు భరోసాను ఎగ్గొట్టి అరకొర రుణమాఫీ చేసిన సర్కారు కనీసం పంట నష్టపరిహారం ఇచ్చైనా రైతులను ఆదుకుంటుందని ఆశిస్తే నిరాశే ఎదురైంది. కుండపోత వర్షాలతో రాష్ట్ర వ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టుగా సమాచారం. ప్రభుత్వం మాత్రం ప్రాథమిక అంచనా ప్రకారం 4.25 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతినట్టుగా గుర్తించింది. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 10వేల పరిహారం ప్రకటించింది. పుట్టెడు కష్టాల్లో ఉన్న రైతులకు తక్షణ సాయం అందించి ఆదుకోవాల్సిన సర్కారు పంటల సర్వే పేరుతో కాలయాపన చేస్తుందని రైతులు విమర్శిస్తున్నారు. ఈ వానకాలం పంటలే కాకుండా యాసంగిలో అంటే ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలకు సుమారు 4వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఆ పంటలకు కూడా పంటనష్టపరిహారం ఇప్పటికీ ఇవ్వలేదు. ఈ లెక్కన ఎకరాకు రూ.10వేల చొప్పున ప్రభుత్వం పరిహారం అందిస్తే రైతులకు రూ. 500 కోట్ల బాకీ పడింది.

### ఉరికొయ్యపై రైతన్న..!

రుణమాఫీ చేయకపోవడంతో మేడ్చల్‌లో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులు చేసి పంటలు వేసిన రైతులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలి. కానీ కాంగ్రెస్ సర్కారు మాటలు మాత్రమే చెప్పి చేతులెత్తేసింది. దీంతో రైతుకు భరోసా రాక, రుణమాఫీలేక.. పంటనష్టపరిహారం అందక పుట్టెడు కష్టాల్లో ఉన్నాడు.

### అరకొరగానే రుణమాఫీ

ఎన్నికల సమయంలో ఒకే దఫాలో రైతులకు రూ.2 లక్షల రుణాలను మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక మూడు దఫాల్లో అరకొరగానే మాఫీ చేశారు. రుణమాఫీ కింద రైతులకు రూ.31వేల కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.18వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి చేతులు దులిపేసుకున్నది. ఇంకా రూ.13 వేల కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉంది. ఈ మొత్తం ప్రభుత్వం రైతులకు బాకీ పడినట్టే. ప్రభుత్వం రుణమాఫీ పూర్తి చేయకపోవడంతో రైతులకు కొత్త రుణాలు అందడంలేదు. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.18వేల కోట్లు మాఫీ చేస్తే.. బ్యాంకులు ఇప్పటివరకు రూ.10 వేల కోట్లు మాత్రమే తిరిగి రుణాలు ఇచ్చినట్టు మంత్రులే స్వయంగా వెల్లడించారు. ఇటు ప్రభుత్వం, అటు బ్యాంకులు రైతుల రుణాలపై దృష్టి పెట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# ఎన్నిసార్లైనా ఢిల్లీ వెళ్తా

- మనకు రావాల్సిన నిధుల కోసమే వెళ్తున్నా
- ప్రజల ఆకాంక్ష మేరకే ప్రజాపాలన దినోత్సవం
- 'ప్రజాపాలన' వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసా తెచ్చుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ విషయంలో భేషజాలకు పోకుండా తానే స్వయంగా పలుమార్లు ఢిల్లీ వెళ్లానని తెలిపారు. దీనిపైనా కొందరు విమర్శలు చేస్తున్నారని, హక్కుల సాధన కోసం ఎన్నిసార్లైనా ఢిల్లీకి వెళ్తానని చెప్పారు. నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష, ఆలోచన మేరకే సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ అంటేనే త్యాగమని, ఆ త్యాగాలకు ఆద్యుడు దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు. సాయుధ పోరాటంలో ప్రాణ త్యాగాలు చేసిన వారందరికీ ఘన నివాళి అర్పించారు. సెప్టెంబర్ 17ను కొందరు విలీన దినోత్సవమని, కొందరు విమోచన దినోత్సవమని సంబోధిస్తున్నారని.. తాము ప్రజా కోణాన్ని జోడిస్తూ 'ప్రజా పాలన దినోత్సవం'గా నామకరణం చేశామని చెప్పారు.

### తెలంగాణ పునరుజ్జీవనం దిశగా..

తెలంగాణ పునరుజ్జీవనం దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని సీఎం రేవంత్ చెప్పారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ జరపబోతున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై 'ఫ్యూచర్ స్టేట్'గా బ్రాండ్ చేస్తున్నామని, పెట్టుబడుల ఆకర్షణలో ఇదొక వ్యూహాత్మక ప్రయత్నమని చెప్పారు. ఒకప్పుడు లేక్ సిటీగా పేరుపొందిన హైదరాబాద్ ఫ్లడ్స్ సిటీగా దిగజారిందని, దాని ప్రక్షాళన కోసమే హైడ్రా ఏర్పాటు చేశామని తెలిపారు. హైడ్రా వెనుక రాజకీయ కోణం, స్వార్థం లేవన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా హైడ్రా ఆగదని స్పష్టం చేశారు. ఈ ఏడాది 4.50 లక్షల ఇండ్లు నిర్మిస్తామని చెప్పారు. సీఎస్ శాంతికుమారి, మంత్రులు, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆలోచన మేరకే 'ప్రజాపాలనా'?

- సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై విస్మయం
- ఢిల్లీ పర్యటనలను సమర్థించుకోవడంపైనా మండిపాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 17 (నమస్తే తెలంగాణ): నాలుగు కోట్ల ప్రజల ఆలోచన మేరకే సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతున్నది. నాంపల్లిలో జరిగిన ప్రజాపాలన వేడుకల్లో సీఎం మాట్లాడుతూ.. అధికారికంగా మొదటిసారి వేడుకలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అయితే నిజాం సంస్థానం భారత ప్రభుత్వంలో కలిసి 75 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వం 'జాతీయ సమైక్యత వజ్రోత్సవాలు' పేరుతో ఏడాది పాటు నిర్వహించలేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికీ బీఆర్ఎస్ ఆ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నదని గుర్తుచేశారు. కాబట్టి మొదటిసారి అధికారికంగా చేస్తున్నామని చెప్పడం హాస్యాస్పదం అవుతుందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక ప్రజల ఆకాంక్ష, ఆలోచనమేరకే ప్రజాపాలన అనే పేరు పెట్టామని చెప్పడంపైనా ఎద్దేవా చేస్తున్నారు. ఫలానా పేరు పెడతామని నాలుగు కోట్ల మంది ప్రజల నుంచి ఎప్పుడు అభిప్రాయ సేకరణ చేశారని ప్రశ్నిస్తున్నారు. కనీసం మంత్రివర్గంలో కూడా చర్చించకుండా.. ప్రజలకు ముందుగా తెలిసేలా ఒక ప్రకటన కూడా చేయకుండా ఇష్టం వచ్చినట్టు పేరు పెట్టుకొని, మళ్లీ ప్రజలపై రుద్దుతారా? అంటూ మండిపడుతున్నారు. పథకాల అమలుకు ఆమోదం కోసం, పీసీసీ అధ్యక్ష పదవి కోసం, మంత్రివర్గ విస్తరణ కోసం.. ఇలా ప్రతి చిన్న విషయానికి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ హక్కుల పేరు చెప్పుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తూతూమంత్రంగా కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చినంత మాత్రాన రాజకీయ పర్యటనలు అధికారిక పర్యటనలుగా మారవని స్పష్టం చేస్తున్నారు.

జటప్రోల్‌లో మంత్రి జూపల్లికి సమస్య విన్నవిస్తున్న దళితులను అడ